


హంద్రీ నీవా కాలువకు గండి

- పందికోన వద్ద 108.100 కిలోమీటర్ సమీపంలో ..
- చిన్నవోణి పొంగి పొర్లడంతో కోతకు గురైన కాలువ గట్టు
- కొట్టుకుపోయిన కాలువ నూతన కాంక్రీట్ లైనింగ్



హంద్రీనీవా కాలువకు పడ్డ గండి

పత్తికొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా ప్రధాన కాలువ 108.100 కిలోమీటర్ వద్ద గండి పడింది. పత్తికొండ మండల పరిధిలోని పందికోన గ్రామ సమీపంలో గండి పడటానికి పక్కనే ప్రవహిస్తున్న చిన్నవోణివంక ఉధృతే కారణమని అధికారులు చెబుతున్నారు. హంద్రీ నీవా కాలువలో నీటిప్రవాహం లేకపోవడంతో భారీనష్టం తప్పిందని పందికోన గ్రామస్థులు చెబుతున్నారు. కాలువలో నీటి ప్రవాహం ఉన్నప్పుడు గండిపడి ఉంటే హంద్రీ నీవా నీరు బయటకు వచ్చి పంట పొలాలు మునిగిపోయి తీవ్రనష్టం వాటిల్లేదని వారు చెబుతున్నారు.



గండికి కారణాలు ఏమిటి?

పందికోన అటవీ ప్రాంతంలో కురిసే వాన నీటిని కింది ప్రాంతాలకు తరలించే చిన్నవోణి వంక ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడడమే గండికి కారణమని తెలుస్తోంది. వంకకు అటువైపుగా ఉన్న పొలాలకు దారి ఏర్పాటు చేసుకోవడానికి రైతులు వేసుకున్న మట్టి దారులే వంకలో నీటి ప్రవాహానికి అడ్డంగా మారాయి. దీనికి తోడు చిన్నవోణిలో ముళ్లకంపలు పెరిగిపోవడం కూడా మరో కారణంగా తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం వల్ల వంకకు చేరిన నీరు వెళ్లడానికి దారిలేక పక్కనే ఉన్న హంద్రీనీవా కాలువ గట్టును కోతకు గురిచేయడంతో గండి పడినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా చిన్నవోణి ప్రవాహం వల్ల పదేళ్లక్రితం కూడా ఈ ప్రాంతంలో హంద్రీ నీవా కాలువకు గండిపడినట్లు గ్రామస్థులు తెలిపారు.

కాలువ లైనింగ్ నాణ్యతపై అనుమానాలు

పత్తికొండ నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ 87 కిలోమీటర్లు ఉంది. కాలువ విస్తరణ పనులు ఇప్పటికి 40శాతం మేర పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు నీటి ప్రవాహం ధాటికి కాలువ కోతకు గురికాకుండా 100 ఎంఎం మందంలో ఏర్పాటు చేస్తున్న కాంక్రీట్ సైడ్‌వాల్ పనులు 10శాతం పూర్తిచేసినట్లు వారు చెబుతున్నారు. అయితే కాలువ కోతకు గురికాకుండా 100 ఎంఎంతో నూతనంగా కాలువకు రెండు వైపుల నిర్మిస్తున్న సైడ్‌వాల్ నాణ్యతపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చిన్నవంక ప్రవాహం వల్ల ఏర్పడ్డ గండికి 100ఎంఎంతో కాలువ భద్రతకు నిర్మించిన సైడ్‌వాల్ కొట్టుకు పోయిందని, ఇక హంద్రీనీవా నీటి ప్రవాహానికి సైడ్‌వాల్ తట్టుకుంటుందా అనే అనుమానాలు వారు వ్యక్తం చేస్తున్నారు.

చిన్నవోణి ఆక్రమణల వల్లే గండి

హంద్రీనీవా గతంలో 10.5 మీటర్ల వెడల్పుతో ఉండేది. దాన్ని 19.55 మీటర్లకు విస్తీర్ణం పెంచుతూ ప్రభుత్వం ఈ ఏడాది పనులు చేపట్టింది. కాలువ విస్తీర్ణం పనులు 40శాతం పూర్తికాగా లైనింగ్ పనులు 10శాతం పూర్తిచేశాం. పందికోన సమీపంలో 108.100 కిలోమీటర్ వద్ద ఏర్పడ్డ గండికి పక్కనే ప్రవహిస్తున్న చిన్నవోణి వంక ప్రవాహమే కారణంగా గుర్తించాం. వంకపై రైతులు పొలాలకు వెళ్లేందుకు దారులు ఏర్పాటు చేసుకోవడానికి ఆక్రమించారు. దీంతో నీరు వెళ్లేందుకు దారిలేక కాలువను కోతకు గురిచేసింది. - ప్రసాద్, డీఈ, హెచ్‌ఎన్ఎస్ఎస్

ఆశావహుల నిరీక్షణ





నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు నిరీక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తుండటంతో వారిలో ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో మొత్తం ఏడు వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో వ్యవసాయ ఉత్పత్తులు క్రయ విక్రయాలు రెగ్యులర్‌గా సాగుతున్నాయి. మంత్రాలయం (కోసిగి), కోడుమూరు, ఆలూరు మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా ఉన్నాయి. పత్తికొండలో మాత్రం సీజన్‌లో టమోటా విక్రయాలు, మిగిలిన సమయాల్లో పశువుల సంత జరుగుతుంది. కాగా సోమవారం ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ పాలకవర్గాలు కొలువుదీరాయి. కాగా మిగతా స్థానాల్లో చైర్మన్‌గిరి ఎవరికి దక్కుతుందన్న దానిపై ఉత్కంఠత కొనసాగుతోంది. కాగా కర్నూలు, ఆదోని చైర్మన్ పీఠాలపై తీవ్ర పోటీ నెలకొంది. ఎవరికి వారు తమ తమ అనుచరులకు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఏమైనా జిల్లాలో మార్కెట్ చైర్మన్ పదవులపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

కర్నూలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం కృషి చేసిన తెలుగుతమ్ముళ్లు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పదవుల కోసం ఆశావహులు నిరీక్షిస్తున్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది అవుతోంది. కీలకమైన వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సహా పాలకవర్గ సభ్యుల నియామకాలు చేయకపోవడం తెలుగుతమ్ముళ్లను నిరాశకు గురిచేస్తుంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఎమ్మిగనూరు మార్కెట్ చైర్మన్‌గా గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ మల్లయ్య, పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్‌గా కృష్ణగిరి మండలం అలంకొండకు చెందిన నబీసాహెబ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో పత్తి, ఉల్లి విక్రయాల్లో కీలకమైన ఆదోని, కర్నూలు మార్కెట్‌యార్డులు సహా మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు మార్కెట్ పాలనా దీశులు ఎవరు? నామినేటెడ్ పదవుల ఎంపికలో జాప్యానికి కారణాలు ఏమిటి? టీడీపీ శ్రేణుల్లో జరుగుతున్న హాట్ టాపిక్ ఇది. ఏఎంసీ నామినేటెడ్ పదవుల పందేరం రాజకీయ వేడి రాజుకుంది.

కర్నూలు చైర్మన్ పీఠంపై తీవ్ర పోటీ

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఉల్లి క్రయ విక్రయాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుంది. రాష్ట్రంలో ప్రధాన మార్కెట్లలో ఇది ఒకటి. ఏడాదిలో సుమారు రూ.700 కోట్లకు పైగా విలువైన వివిధ పంట ఉత్పత్తులు విక్రయాలు జరుగుతున్నాయి. కూరగాయల హోల్‌సెల్ మార్కెట్ కూడా ఇక్కడే నిర్వహిస్తున్నారు.

మిగతా 6వ పేజీలో



ఆదోని మార్కెట్ యార్డు

- కొలిక్కిరాని మార్కెట్ చైర్మన్ల ఎంపిక..!
- జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ యార్డులు
- ఐదు కమిటీల చైర్మన్ల ఎంపికలో జాప్యం
- కొలువుదీరిన ఎమ్మిగనూరు, పత్తికొండ పాలకవర్గం
- ఆదోని చైర్మన్ పీఠం కోసం కూటమిలో కుదరని ఐక్యత
- కర్నూలు మైనార్టీ మహిళకు దక్కే అవకాశం?
- నిరాశలో తెలుగు తమ్ముళ్లు

ఏడాదిగా ఎదురుచూపులు

జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు రెగ్యులర్‌గా సాగుతున్నాయి. పత్తికొండ మార్కెట్ సీజన్‌లో టమోటా విక్రయాలు, మిగిలిన సమయాల్లో పశువుల సంత జరుగుతుంది. మంత్రాలయం (కోసిగి), కోడుమూరు, ఆలూరు మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా ఉన్నాయి. కోడుమూరు పేరుకే మార్కెట్ ఇక్కడ కనీసం ఆఫీసు కూడా లేదు. ఏడు మార్కెట్లలో ఏడాదికి రూ.3,600 కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరుగతున్నాయి. మార్కెట్ సెస్సు రూపంలో రూ.36కోట్లు ఆదాయం వస్తుంది. వైసీపీ హయాంలో 2022లో మార్కెట్ కమిటీలకు నూతన పాలవర్గాలను నియమించింది. 2024 జూన్ 12 టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆరు నెలలు తరువాత మార్కెట్ చైర్మన్ స్థానాలు భర్తీకి శ్రీకారం చుట్టింది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి ఆ మేరకు ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు తీసుకున్నారు. టీడీపీ శ్రేణుల్లో ఆశావహులకు అదిగో.. ఇదిగో చైర్మన్ పీఠం వరించబోతుంది? అంటూ ఏడాదిగా నిరీక్షణ తప్పడం లేదు. కొందరి పేర్లు తెరపైకి వచ్చినా.. రాజకీయ, సామాజిక సమీకరణాల కారణంగా తెర మరుగు అవుతున్నారు. ఎట్టకేలకు ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గం కొలువుదీరింది.

'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. కర్నూలు జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు మొత్తం 13,631 మంది హాజరయ్యారు. ఇందులో 9,825 మంది పాసై 72.08 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 8,885 మంది పరీక్షకు హాజరు కాగా, 6,171 మంది పాసై 69.95 శాతం, బాలికలు 4,746 మంది హాజరు కాగా, 3,654 మంది పాసై 76.99 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు.

'ఆంధ్రజ్యోతి'కి రుణ పడి ఉంటా..

6


- 'పది' పాస్ అవుతానని అనుకోలేదు
- సన్నక్కి భావోద్వేగం
- పదో తరగతిలో ఉత్తీర్ణత



పాసైన అనంతరం సన్నక్కి

17న పారిశుధ్య కార్మికులతో యోగా

- పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం
- 21న ప్రపంచ యోగా దినోత్సవం
- కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 17న ఐదు వేల మంది పారిశుధ్య కార్మికులతో యోగా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గురువారం ఉదయం యోగాంధ్ర నిర్వహణపై ఆర్డీవోలు, జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర నిర్వహణలో భాగంగా రిజిస్ట్రేషన్ చేయడంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించామన్నారు. రిజిస్ట్రేషన్ చేసిన పౌరులను ట్రైనర్లకు మ్యాపింగ్ చేయడంలో 91శాతం పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా యోగా అంతర్జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని 10.65 లక్షల మంది పాల్గొంటారన్నారు. జేసీ డా.బి.నవ్య, మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే రోల్‌మోడల్‌గా రాష్ట్రం

- అభివృద్ధిని చూసి తట్టుకోలేక జగన్ కుట్రలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి
- పార్టీ కార్యాలయంలో సంబరాలు



టీడీపీ కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే రోల్ మోడల్‌గా రాష్ట్రం నిలిచిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తల మధ్య ఏడాది పాలన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటువైపు వెళ్తున్న ప్రజలకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే జగన్ కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని ముక్కలు చేయాలని జగన్మోహన్‌రెడ్డి చూశాడని, ఇటీవల అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడే ముందు ఆయన కుటుంబం ఎక్కడ నివాసం ఉందో ఆలోచించుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని, టీజీ భరత్‌కు క్యాబినెట్‌లో కీలక పదవిని కట్టబెట్టడంతో పాటు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, నగర అధ్యక్షుడు నాగరాజుయాదవ్, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేశ జగదీష్, జిల్లా ప్రధానకార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, కార్పొరేటర్లు కురవ పరమేష్, పద్మలత, టీజీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, మాజీ ఎంపీ సంజీవకుమార్, కేవీ సుబ్బారెడ్డి, హనుమంతరావు చౌదరి, చంద్రకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి కళకళ

- హుషారుగా తొలిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులు
- పునఃప్రారంభమైన పాఠశాలలు



ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాలలో విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదైంది. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు పాఠశాలలకు రావడంతో హుషారుగా కనిపించారు. రెండు రోజుల ముందుగానే ప్రధానోపాధ్యాయులు పాఠశాలల పరిసరాలను, కిచెన్ సెంటర్లను, వంట పాత్రలను శుభ్రం చేయించారు. విద్యార్థుల రాకతో పాఠశాలల ప్రాంగణాలు కళకళలాడాయి. రాష్ట్ర ప్రభుత్వం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. నోట్‌బుక్స్, బెల్టులు, డిక్షనరీ, షూస్, యూనిఫాం, వర్క్‌బుక్‌లను బ్యాగులో పెట్టి అందజేశారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కండేరి వీధిలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అధ్యక్షతన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు డీఈవో శామ్యూల్ పాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. అనంతరం సన్నబియ్యంతో తయారు చేసిన అన్నం, ఎగ్‌కర్రి, వెజిటబుల్ రైస్‌లను మధ్యాహ్న భోజనంగా విద్యార్థులకు అందించారు. డీఈవో శామ్యూల్ పాల్, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రవి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాజకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తుంగభద్ర పరవళ్లు

- మంత్రాలయం వద్ద 308 మీటర్ల నీటిమట్టం
- 12 వేల క్యూసెక్కుల ప్రవాహం



మంత్రాలయం వద్ద తుంగభద్ర వరద ప్రవాహం

మంత్రాలయం, జూన్ 12(ఆంధ్రజ్యోతి) మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర పరవళ్లు తొక్కుతోంది. గురువారం సాయంత్రం 6.30 గంటలకు మంత్రాలయం వద్ద 308 మీటర్ల నీటి మట్టంతో 12,000 క్యూసెక్కుల నీరు ప్రవహించింది. కర్ణాటక, ఆంధ్రలో కురుస్తున్న వర్షాలకు వంకలు, వాగులు పొంగిపొర్లడంతో తుంగభద్రనది రెండువైపులా సరిహద్దులను తాకుతూ ఊపందుకుంది. నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నదిలో వరద ప్రవాహానికి నదీతీర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నవ్విపోదురుగాక..!

మంత్రాలయం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పది మంది చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేసేందుకే ఏకంగా 16 మంది స్టేజీపై కూర్చొని గంటసేపు ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చి.. రెండు నిమిషాల్లో పుస్తకాల పంపిణీ పూర్తి చేశారు. మంత్రాలయం మండలం వగరూరు జడ్పీ పాఠశాలలో గురువారం పాఠశాల పునఃప్రారంభమైంది. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అంతా బాగానే ఉన్నప్పటికీ ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల కంటే అతిథులే అధికంగా కనిపించారు. రెండు నిమిషాల పుస్తకాల పంపిణీకి 16 మంది రావడం, వారందరూ ప్రసంగాలు ఇవ్వడం అవసరమా? అంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణ, పాఠశాల చైర్మన్ దండు శేఖర్, టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, లింగప్ప, వీరారెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, ఆనంద్, నటరాజ్, కే.వెంకటేశ్వర్లు, హేమ, మాబు, లలిత హాజరయ్యారు.



వగరూరు ఉన్నత పాఠశాలలో పదిమంది విద్యార్థులకు ప్రసంగం చేస్తున్న నాయకులు

కొండారెడ్డి బురుజుపై 'యోగా'



యోగా చేస్తున్న యువకులు

కర్నూలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యోగా... మానవ జీవితంలో ఒక భాగమైతే ఆరోగ్యం మన సొంతమైనట్టే. రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం కర్నూలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. గురువారం కర్నూలు జిల్లా ఐకానిక్‌గా గుర్తింపు పొందిన చారిత్రాత్మక కట్టడం కొండారెడ్డి బురుజు వద్ద ప్రజలు, విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆలోచింపజేశాయి. కొండారెడ్డి బురుజుపై, బురుజు ఎదుట రహదారుల్లో గురువారం ఉదయం వందలాదిగా పట్టణ ప్రజలు తరలివచ్చి యోగాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, ఎన్‌సీసీ కమాండెంట్ ప్రసాద్, జడ్పీ సీఈఓ నాసర రెడ్డి, డీఎస్ఓ రాజా రఘువీర్, డీఎస్పీ రాఘవేంద్ర, మెప్మా పీడీ నాగ శివలీల, టూరిజం శాఖ అధికారి విజయ్, కార్పొరేటర్ క్రైప పద్మలతా రెడ్డి, ఆయూష్ డాక్టర్ ప్రసాద్, యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అవినాష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.





యోగా నిర్వాహకులకు బహుమతులు

కొండారెడ్డి బురుజు ఎదుట రహదారిపై యోగాసనాలు

నేడు జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడుస్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి 11.00 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11.00 నుంచి 12.00 గంటల వరకు మూడోవ, 12.00 గంటల నుంచి 1.00 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1.00 నుంచి 2.00 గంటల వరకు 4వస్థాయి సంఘం, 2.30 గంటల నుంచి 3.30 వరకు 5వ స్థాయి సంఘం, 3.30 నుంచి 5.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈవో వివరించారు.

జిల్లా పరిశ్రమల కేంద్రంలో బదిలీలు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల కేంద్రంలో బదిలీలు జరిగాయి. సాధారణ బదిలీల్లో భాగంగా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించి, సెలవులో వెళ్లిన కేపీ సుధాకర్‌ను ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఉప సంచాలకులు ఉంటూ ఇన్‌చార్జి జీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న అరుణ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నంద్యాల జిల్లా పరిశ్రమల కేంద్రంలో ఉప సంచాలకులుగా పనిచేస్తున్న జవహర్ బాబును కర్నూలుకు బదిలీ చేశారు.

చౌడేశ్వరీమాత ఆలయ ఏసీగా శ్రీనివాసరెడ్డి



బనగానపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని నియమించారు. నందవరం ఆలయ ఈవోగా పనిచేస్తున్న కామేశ్వరమ్మను అమరావతికి సమీపంలోని దేవాలయాలకు బదిలీచేశారు. ఆమెస్థానంలో మహానంది దేవస్థాన ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డిని నందవరం చౌడేశ్వరీమాత ఆలయానికి బదిలీ అయ్యారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం ఆయన నందవరం ఆలయంలో పదవీబాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు వైద్యశాఖలో బదిలీల జాబితా విడుదల

కర్నూలు హాస్పిటల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖలో జిల్లా క్యాడర్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల ఆప్షన్ జాబితాను శుక్రవారం అధికారులు ప్రకటించనున్నారు. జాబితా విడుదల అనంతరం ఈ నెల 14, 15 తేదీల్లో అభ్యంతరాలు ఉంటే జిల్లా వైద్య శాఖ కార్యాలయానికి తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. రిడిప్లాయిమెంటులో ఉన్న ఏఎన్ఎంలు కోరుతుంటే తప్ప బదిలీలు ఉండవని ఇంత వరకు 30 మంది తమకు బదిలీలు వద్దంటూ వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, తెలిపారు. గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో బదిలీల జాబితా కోసం స్క్రూటినీని కార్యాలయ ఏవో అరుణ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్లు భూపాల్, లోకసాయి, జూనియర్ అసిస్టెంట్లు సోహేల్, మన్సూర్ నిర్వహించారు.

వైద్యసేవల్లో కర్నూలుకు మొదటి స్థానం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకం కింద మేనెలలో 3,553 రోగులకు చికిత్స ఆపరేషన్లు నిర్వహించి రాష్ట్రంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మొదటి స్థానంలో నిలిచిందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆసుపత్రి ధన్వంతరీ హాలులో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ-హాస్పిటల్ అమలు పూర్తిస్థాయిలో జరగాలన్నారు. రెగ్యులర్‌గా ప్రతి విభాగపు ఓపీ, ఐపీ డిశ్చార్జ్ కేసులను ఈ-హాస్పిటల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమీక్షలో సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, హెచ్‌వోడీలు సి.శ్రీనివాసులు, విజయానందబాబు, రాధారాణి, శ్రీలక్ష్మి, మాధవీ శ్యామల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పదునైన వాన..

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్‌లో నైరుతి రుతుపవనాలు మే నెలాఖరులోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రవేశించి కొన్ని రోజులు వరుస వర్షాలతో రైతన్నలను మురిపించాయి. అయితే ఆ తర్వాత జూన్ నెల మొదలు కాగానే వర్షం పడకేసింది. అప్పటికే ఉమ్మడి జిల్లాలో దాదాపు 15వేల హెక్టార్లలో పత్తి, ఉల్లి, మిర్చి తదితర పంటలు సాగు చేసిన రైతులు వర్షం జాడ లేక ఎండవేడిమికి మొలక రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందారు. రోజూ పొలాలకు వెళ్లి చినుకు కోసం ఆకాశం వైపు చూడడం తప్పితే.. వారి ఆశలను వరుణదేవుడు ఏ మాత్రం పట్టించుకోలేదు. అయితే.. రెండు రోజుల నుంచి మేఘాలు దట్టంగా అలుముకుని రైతులకు శుభసూచకాన్ని అందించాయి. గురువారం కర్నూలు జిల్లా అంతటా భారీ ఎత్తున వర్షం నమోదైంది. జిల్లాలోని 21 మండలాల్లో 79.4 ఎంఎం వర్షం నుంచి 12.8 ఎంఎం వర్షం నమోదైంది. జూన్ నెలలో సగటు వర్షపాతం 31.1 ఎంఎం కురవాల్సి ఉండగా.. గురువారం ఒక్కరోజే 31.1 ఎంఎం నమోదైంది. జూన్ మొదలుకొని గురువారం వరకు 59.9 ఎంఎం వర్షపాతం నమోదైంది. పొలాలు పదునెక్కడంతో గడువులోపు విత్తనం వేస్తే అధికోత్పత్తితో పాటు చీడపురుగులు వ్యాపించవనే నమ్మకంతో రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. కర్నూలులోని కొత్తబస్టాండు వద్ద ఉన్న అంగళ్ల వద్ద ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూ కట్టారు.

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

- కడుపు నిండా తింటున్న విద్యార్థులు
- ఈ విద్యా సంవత్సరం నుంచి మెనూలో మార్పులు



బియ్యం అందజేస్తున్న డీఈవో





కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేస్తోంది. గతంలో పీడీఎఫ్ ద్వారా సరఫరా చేసిన దొడ్డు బియ్యంతో తయారు చేసిన భోజనం తినలేక విద్యార్థులు కడుపును మాడ్చుకుని ఇంటికి వెళ్లేవారు. మరికొంత మంది పాఠశాలలకు వచ్చే టప్పుడు ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకునేవారు. పాఠశాలలో తయారు చేసే భోజనం మెత్తగానూ, ముద్ద ముద్దగా ఉండటంతో తినలేక పారవేసేవారు. కూటమి ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం సరఫరా చేస్తోంది. కర్నూలు జిల్లాలో 2.70 లక్షల మంది విద్యార్థులు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సివిల్ సప్లయ్ శాఖ ద్వారా 25 కేజీల సంచుల్లో సన్నబియ్యం ప్యాక్ చేసి పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. బియ్యం దుర్వినియోగం కాకుండా బ్యాగులపై క్యూఆర్ కోడ్ నెంబరును కూడా ముద్రించారు. సోమవారం తెల్ల అన్నం, వెజిటబల్ కర్రీ, గుడ్డు, చిక్కి, మంగళవారం పులగం, నిమ్మ అన్నం, చింతపండు అన్నం, వేరుశనగ చెట్నీ, గుడ్డు రాగి జావ, బుధవారం తెల్ల అన్నం, వెజిటెబుల్ సాంబారు, గుడ్డు, చిక్కి, గురువారం వెజిటబుల్ రైస్, ఎగ్ కర్రీ, రాగి జావ, శుక్రవారం తెల్ల అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి, శనివారం తెల్ల అన్నం, కందిపప్పు చారు, బెల్లం పొంగలి, రాగి జావ మెనూగా విద్యాశాఖ అధికారులు రూపొందించారు.

విద్యార్థి కిట్ల నాణ్యత బాగుంది



ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసిన విద్యార్థి మిత్ర కిట్లు నాణ్యత బాగుంది. పేద విద్యార్థులకు ఎంతో ఊరట ఇస్తుంది. పేద కుటుంబాలకు ఇది ఊరట.

● రసూల్ ఖాన్, విద్యార్థి తండ్రి, ఖండేరి వీధి

గతంలో భోజనం తినేవారు కాదు



పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచికరంగా లేని కారణంగా గతంలో విద్యార్థులు సరిగా తినేవారు కాదు. అర్ధాకలితో ఇంటికి వెళ్లి తినేవారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వండటంతో కడుపు నిండా భోజనం చేస్తున్నారు.

● నాగదేవి, ఉపాధ్యాయురాలు

స్కూల్ బ్యాగ్ బావుంది



ప్రభుత్వం సరఫరా చేసిన విద్యార్థి మిత్ర కిట్ బ్యాగ్ బావుంది. యూనిఫాం డిజైన్ కూడా కార్పొరేట్ స్థాయిలో ఉంది. మాకు ఎంతో ఆనందంగా ఉంది.

● బద్రినాథ్, పదో తరగతి విద్యార్థి

ఆంధ్రజ్యోతికి రుణ పడి ఉంటా

- 'పది' పాస్ అవుతానని అనుకోలేదు
- ఆనంద బాష్పాలతో సన్నక్కి
- పదో తరగతిలో ఉత్తీర్ణత



పరీక్ష హాలులో కాదు..

'వలస' వెళ్లి పొలంలో!

» చిన్నారికి వచ్చిన పెద్ద కష్టం

» పది పరీక్షలు రాయాల్సిన చేతులతో మిర్చి కోతలు

ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనం

కోసిగి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కథనాలే తన జీవితాన్ని మలుపు తిప్పాయని, ఆంధ్రజ్యోతికి రుణపడి ఉంటానని విద్యార్థిని సన్నక్కి పేర్కొంది. గురువారం విడుదలైన పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించింది. పదో తరగతి పరీక్షలు రాయాల్సిన విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు వలస వెళ్లి గుంటూరులో మిర్చి పొలాల్లో కూలీగా పనిచేస్తుంది. విషయం తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి చిన్నారితో మాట్లాడారు. ఈమేరకు 'పరీక్ష హాలులో కాదు.. 'వలస' వెళ్లి పొలంలో' అనే కథనం ప్రధాన సంచికలో ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. కర్నూలు, గుంటూరు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి గుంటూరు జిల్లా పేరెచర్ల పంట పొలాల్లో మిర్చి తీసేందుకు కూలీగా పని చేస్తున్న సన్నక్కి చిన్నారిని సొంతూరు అయిన కోసిగి మండలం చింతకుంట గ్రామానికి తీసుకువచ్చారు. అప్పటికే పదో తరగతి రెండు పరీక్షలు పూర్తికావడంతో మూడో పరీక్ష నుంచి మొత్తం నాలుగు పరీక్షలు రాయించారు. ఆ నాలుగు పరీక్షల్లో ఆమె ఉత్తీర్ణత సాధించింది. మిస్ అయిన మిగతా రెండు పరీక్షలను సప్లిమెంటరీలో రాసింది. గురువారం సాయంత్రం విడుదలైన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 344 మార్కులతో విద్యార్థిని సన్నక్కి చిన్నారి ఉతీర్ణత సాధించింది. ఆంధ్రజ్యోతి కథనం తన జీవితానికి వెలుగుఇచ్చి తన స్నేహితులతో కలిసి పై చదువులు చదివేందుకు తోడ్పాటు ఇచ్చిందని విద్యార్థిని సన్నక్కి చిన్నారి ఆనందబాష్పాలతో కన్నీటి పర్యంతమైంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కర్నూలు, గుంటూరు జిల్లా కలెక్టర్లకు, జిల్లా విద్యాశాఖ అధికారి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.



విద్యార్థిని సన్నక్కి చిన్నారి (ఫైల్)

ఆశావహుల నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

ఒక శాతం సెస్సు రూపంలో రూ.7 కోట్లు ఆదాయం వస్తుంది. ఎంతో కీలకమైన ఆ మార్కెట్ చైర్మన్ పీఠం కోసం టీడీపీలో తీవ్ర పోటీ ఉంది. ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు అత్యంత సన్నిహితుడైన కల్లూరు మండలం పెద్దపాడు గ్రామం టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్.చంద్రకళాధర్‌రెడ్డి చైర్మన్ పీఠం ఆశించారు. అయితే.. కర్నూలు అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో మార్కెట్ యార్డు వస్తుండడం, బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ సిఫారసు చేసిన వారికే చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉంది. టీజీ భరత్‌కు అత్యంత సన్నిహితుడైన టీడీపీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు గోల్కొండ అబ్దుల్ అమీద్ సతీమణి గోల్కొండ అజ్మత్‌బీ పేరును సిఫారస్ చేసినట్లు తెలుస్తుంది. మైనార్టీ కోటాలో చైర్మన్ గిరి అజ్మత్‌బీకే దక్కే ఛాన్స్ ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆదోని పీఠంపై ఉత్కంఠ

ఆదోని వ్యవసాయ మార్కెట్ ఆదాయంలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉంది. గుంటూరు మార్కెట్ తరువాత స్థానం ఆదోనిదే. పత్తి విక్రయాల్లో అగ్రస్థానంలో ఉంది. ఏడాదిలో రూ.1,700 కోట్లకు పైగా విలువైన పత్తి సహా వేరుశనగ, ఆముదం, మిరప, వాము.. ఇలా వివిధ పంట ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఒక శాతం మార్కెట్ సెస్సు రూపంలో రూ.17 కోట్లు ఆదాయం వస్తుంది. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఏమాత్రం తీసిపోని ఆదోని మార్కెట్ యార్డు చైర్మన్ పీఠం కోసం కూటమి పార్టీల్లో తీవ్ర పోటీ నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పార్టీల మద్దతుతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఎమ్మెల్యేగా గెలిచారు. మార్కెట్ చైర్మన్ పీఠం మాకే కావాలని బీజేపీ నేతలు పట్టుబడుతున్నారు. తమకే ఇవ్వాలని కూటమి ప్రధాన పార్టీ టీడీపీ సహా జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ అధిష్టానం కూడా స్పష్టత ఇవ్వలేదు. కూటమి నేతల మధ్య కుమ్మలాటలు, సయోధ్య కుదరకపోవడంతో మూడు పార్టీలు కూడా ప్రతిపాదనలు పంపలేదని తెలుస్తుంది. ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ తరువాత ఆ స్థాయి రాజకీయ హోదా కలిగిన మార్కెట్ యార్డు చైర్మన్ పీఠం దక్కేది ఎవరికి..? అంటూ కూటమి పార్టీల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఆ మూడు మార్కెట్ల చైర్మన్లు ఎవరు?

కోడుమూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రధాన కేంద్రం గూడూరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోడుమూరు టీడీపీ టికెట్‌ను ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో పాటు బి.తాండ్రపాడు సర్పంచ్ ఆకెపోగు జయన్న కూడా ఆశించారు. ఇద్దరు కూడా కేడీసీసీబీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులే. అధిష్టానం బొగ్గుల దస్తగిరికి టికెట్ ఇవ్వడం.. ఆయన ఎమ్మెల్యేగా గెలవడం తెలిసిందే. జయన్నకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంతో కోడుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఆయన సతీమణి ఆకేపోగు సుగణమ్మకు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఆమె పేరును ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాచారం. మంత్రాలయం మార్కెట్ చైర్మన్ పీఠం కోసం కోసిగికి చెందిన టీడీపీ పట్టణాధ్యక్షుడు నర్సిరెడ్డి, తెలుగురైతు సంఘం నాయకులు కోసిగయ్య పేర్లను ప్రతిపాదించినట్లు తెలిసింది. ఆలూరు మార్కెట్ చైర్మన్ పదవి కోసం గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్వయాన సోదరుడు బూర్ల త్యాగరాజు పేరును టీడీపీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్ ప్రతిపాదించినట్లు తెలుస్తుంది. టీడీపీ సీనియర్ నాయకులు చిన్నహ్యాట్ శేషగిరి, ఆస్పరి మాజీ ఎంపీపీ బిల్లేకల్లు వెంకటేశ్ పేర్లను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం ప్రసాద్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. వివిధ కారణాల వల్ల కర్నూలు, ఆదోని, కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికలో జరుగుతున్న జాప్యం వల్ల ఆశావహులు, టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.



ఆలూరు మార్కెట్ యార్డు

వైద్యారోగ్య శాఖ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. వైదారోగ్య శాఖలో ఆడిట్ పేరుతో కొందరు వసూళ్ల దందాకు తెర లేపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 పీహెచ్‌సీలు, 20 సీహెచ్‌సీలు, రెండు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్, రెండు ఏరియా ఆసుపత్రులున్నాయి. వీటిని బలోపేతం చేయడానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద ఏటా రూ.15కోట్ల వరకు నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. ఆసుపత్రుల్లో మందుల సరఫరా, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రోగులు, గర్భిణులకు రవాణా, పరికరాల కొనుగోలు కోసం వీటిని ఖర్చు చేస్తారు. ప్రభుత్వం ఆసుపత్రులకు కేటాయించే నిధులకు సంబంధించిన ఐదేళ్ల ఆడిట్ (ఏజీ) చేయడం సర్వసాధారణం. ఆడిట్ అధికారుల పేరు చెప్పి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కర్నూలు జిల్లాలోని ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.5వేల నుంచి రూ.8వేల వసూళ్లు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.10వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. పీహెచ్‌సీ ఎంత మొత్తం ఇవ్వాల్సింది కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులోని ఓ ఉద్యోగి ఫిక్స్ చేస్తారు.



లెక్కార్పయామి..!

- ఆడిట్ పేరుతో వసూళ్లు?
- రూ.5వేల నుంచి రూ.8వేలు ముట్టజెప్పాల్సిందే
- ముడుపులు ఇవ్వలేమని చేతులెత్తేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు
- హడలెత్తిపోతున్న సిబ్బంది
- వైద్యారోగ్య శాఖపై వసూళ్ల ఆరోపణలు

కర్నూలు హాస్పిటల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లెక్కలు తేలాలంటే ఇంతో.. అంతో సమర్పించాల్సిందే. వైద్యారోగ్య శాఖలో ఆడిట్ (ఏజీ) పేరుతో కొందరు వసూళ్ల దందాకు తెర లేపారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, ఇతర ఆసుపత్రులు నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించాల్సిందేనని హుకుం జారీచేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది హడలెత్తిపోతున్నారు. కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసుకు క్యూకట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌ఎస్), ప్రాంతీయ (ఏరియా) ఆసుపత్రులను పూర్తిస్థాయిలో బలోపేతం చేయడానికి కేంద్రం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)ను అమలు చేస్తోంది. ఇందుకుగానూ ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.15 కోట్లు వరకు నిధులు వెచ్చిస్తోంది. ఆసుపత్రుల్లో మందుల సరఫరా, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రోగులు, గర్భిణులకు రవాణా, పరికరాల కొనుగోలు కోసం వీటిని ఖర్చుచేస్తారు. వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం ఆసుపత్రులకే కేటాయించే నిధులకు సంబంధించిన ఐదేళ్ల ఆడిట్ (ఏజీ) చేయడం సర్వసాధారణం. 2019 నుంచి 2024 వరకు విజయవాడ నుంచి ముగ్గురు సభ్యులు గల ఆడిట్ అధికారులు ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఆడిట్ అధికారుల పేరు చెప్పి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ నుంచి రూ.500

ఉమ్మడి జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్ లెవల్‌హెల్త్ ప్రొవైడర్) 800మంది ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లాలోని 440 మంది ఎంఎల్‌హెచ్‌పీల నుంచి వసూళ్ల రాయుళ్లు ముక్కుపిండి ఒక్కొక్క ఎంఎల్‌హెచ్‌పీ నుంచి రూ.500 చొప్పున వసూళ్లు చేస్తున్నారు. తాము ఒక నెల రోజుల నుంచి సమ్మెలో ఉన్నామని, మే నెల జీతం కూడా రాలేదని, 6 నెలల ఇన్సెంటివ్స్ పెండింగ్‌లో ఉన్నాయని, అద్దె కూడా రాలేదని తాము రూ.500 ఇచ్చుకోలేని ఎంఎల్‌హెచ్‌పీలు చెప్పినా ఇవేమీ వసూళ్ల రాయుళ్లకు పట్టడం లేదు. మీరు చెప్పింది ఇవ్వకపోతే జీతాలు నిలుపుదల చేయిస్తామని బెది రింపులకు దిగుతున్నారు. పత్తికొండ డివిజన్‌లోని ఓ పీహెచ్‌సీకి చెందిన ఎంఎల్‌హెచ్‌పీలు తాము రూ.500లు ఇవ్వలేమని కరాఖండిగా చెప్పినా బెదిరింపులకు దిగినట్లు సమాచారం. ఎంఎల్‌హెచ్‌పీల నుంచి వసూళ్లుచేసిన మొత్తాన్ని పీహెచ్‌సీ నుంచి మరికొందరు డీఎం హెచ్‌వో కార్యాలయానికి వసూళ్లు చేసిన మొత్తాన్ని చేరవేసినట్లు తెలిసింది. నంద్యాల జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.



- కర్నూలు డివిజన్‌లోని ఓ పీహెచ్‌సీకి సంబంధించిన ఆడిట్ జరుగుతోంది. ఆ పీహెచ్‌సీ రూ.5వేలు ఇవ్వాల్సిందిగా హుకుం జారీ చేశారు. ఈ విషయాన్ని సంబంధిత మెడికల్ ఆఫీసర్‌కు చెప్పగా నాకు సంబంధంలేదని తాము బడ్జెట్ అంతగా ఉపయోగించలేదని సమాధానం చెప్పారు. దీంతో పీహెచ్‌సీ ఉద్యోగి మరో ఉద్యోగి దగ్గర చేతి బదులు ఇప్పించుకుని రూ.5వేలు ముట్ట చెప్పారు.
- ఆదోని డివిజన్‌లోని ఓ పీహెచ్‌సీకి చెందిన ఓ ఉద్యోగి ఆడిట్ ఉంటే అంతో ఇంతో ఇవ్వాల్సి ఉంటుంది. వచ్చినవారికి సౌకర్యాలు కోసం కొంత సొమ్ము ముట్టచెప్పాల్సి ఉంటుందని చెప్పడం విశేషం.
- కర్నూలు జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీలు కూడా తమకు సంబంధం లేని ఆడిట్ కోసం ఎందుకు రూ.500లు ఇవ్వాలని పేరు చెప్పనీ ఎంఎల్‌హెచ్‌పీ పేర్కొనడం విశేషం. రూ.500లు ఇవ్వమని చెప్పిన వారిపై జీతాలు నిలుపుదల చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్న చెప్పారు.

ఓన్లీ క్యాష్..

వసూళ్ల రాయుళ్లు కొత్త పంథాను అవలంభిస్తున్నారు. వసూళ్ల పర్వం బయట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతిదానికి ఫోన్‌పే, గూగుల్ పే వాడుతున్న ప్రస్తుత తరుణంలో ఓన్లీ క్యాష్ మాత్రమే ఇవ్వాలన్న కండిషన్ పెట్టారు. ఆన్‌లైన్ ద్వారా ఆధారాలు లభిస్తాయని, తర్వాత తమపై ఫిర్యాదు చేసి ఇబ్బంది పెట్టే ప్రమాదం ఉందని ముందు జాగ్రత్తగా ఓన్లీ క్యాష్ అన్న కండిషన్ పెట్టినట్లు సమాచారం. ఇప్పటి వరకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, కర్నూలు జీజీహెచ్, నంద్యాల జీజీహెచ్, ఎంఎల్‌హెచ్‌పీల నుంచి సుమారు రూ.10లక్షలు వసూళ్లు చేసినట్లు అంచనా.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 పీహెచ్‌సీలు, 20 సీహెచ్‌సీలు, రెండు గవర్నమెంటు జనరల్ హాస్పిటల్స్, రెండు ఏరియా ఆసుపత్రులున్నాయి. వీటిని బలోపేతం చేయడానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద ఏటా రూ.15 కోట్లు వరకు నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లకు (పీహెచ్‌సీ) ఒక్కొక్క దానికి ఏటా రూ.1.75లక్షలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ)కు ఒక్కొక్క సీహెచ్‌సీకి రూ.5లక్షలు, ఏరియా ఆసుపత్రికి రూ.5లక్షలు నిధులు విడుదల చేస్తుంది.

డీఎంహెచ్‌వో ఆఫీసులోని ఓ ఉద్యోగి..

ఆడిట్ కోసం కర్నూలు జిల్లాలోని ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.5వేల నుంచి రూ.8వేల వసూళ్లు చేస్తున్నారు. బడ్జెట్ తక్కువ మొత్తంలో ఖర్చు పెట్టి ఉంటే రూ.5వేలు, ఎక్కువ మొత్తంలో అయితే రూ.8వేలు ఇవ్వాల్సిందే. నంద్యాల జిల్లాలో ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.10వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. పీహెచ్‌సీ ఎంత మొత్తం ఇవ్వాల్సింది కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులోని ఓ ఉద్యోగి ఫిక్స్ చేస్తారు. దానిప్రకారం ఆయా పీహెచ్‌సీ సిబ్బంది వచ్చి ఆమొత్తాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

2019లో చివరిసారిగా ఆడిట్..

ప్రతి ఐదేళ్లకోసారి ఎన్‌హెచ్‌ఎం నిధులు, ఉద్యోగుల జీతభత్యాలపై ఆడిట్‌ను అధికా రులు నిర్వహిస్తారు. 2019లో చివరి సారిగా ఆడిట్ జరిగింది. మళ్లీ ఇప్పుడు 2019 నుంచి 2024 వరకు ఆడిట్ చేయాల్సి ఉంది. ఎన్‌హెచ్‌ఎం నిధులు సక్రమంగా పంపిణీ చేశారా? నిధులు ఖర్చు చేయడంలో నిబంధనలు పాటించారా? లేదా? నిర్లక్ష్యంగా వహించారా? అవినీతి అక్రమాలకు పాల్పడ్డారా? అన్న అంశాలు ఈ ఆడిట్‌లో బయట పడే అవకాశాలు ఉన్నాయి. ఏదైనా లోపాలు బయటపడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో ఆడిట్ అంటే వైద్య శాఖఅధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతు న్నాయి. నిధుల వ్యవహారంలో కచ్చితంగా ఉండే నిబంధనలను పాటించి ఉంటే భయప డాల్సి ఉండదు. అలా జరగనప్పుడు వాటిని కప్పిపుచ్చేందుకు అంతో ఇంతో ముట్టచె ప్పా ల్సిందే. ఆడిట్ అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి కార్యాలయంలో కొందరు ఏజీ ఆడిట్ పేరుతో భారీగా వసూళ్లకు తెర లేపారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఒక్కో పీహెచ్‌సీ నుంచి రూ.5వేల నుంచి రూ.8వేలు చొప్పున ఆడిట్ పేరుతో ముట్టచెప్పాల్సిందే. మొదట రూ.5వేలు ఉన్న మొత్తాన్ని ఇటీవల వసూళ్ల రాయుళ్లు రూ.8వేలకు పెంచినట్లు సమాచారం.

ఆడిట్ పేరుతో వసూళ్లకు పాల్పడలేదు..



వైద్యఆరోగ్యశాఖలో 2019 నుంచి 2025వరకు ఆడిట్ (ఏజీ) షెడ్యూల్ ప్రకారం జరు గుతుంది. అన్నిరికార్డులు, బిల్లులు, ఉద్యోగుల జీతభత్యాలు, ఎన్‌హెచ్‌ఎం వివరాలు, ఆడిట్ అధికారులు క్షేత్రస్థాయిలో ఏ విధంగా ఉన్నాయో పరిశీలిస్తారు. ఆడిట్ అనంతరం నివేది కను సమర్పిస్తారు. ఆడిట్ పేరుతో ఎవరు వసూళ్లకు పాల్పడలేదని, ఈవిషయం తన దృష్టికి రాలేదు. అలాంటి వసూళ్లు ఎవరూ చేయలేదని అది వట్టి ప్రచారమే.

- డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తికి సీఈగా పదోన్నతి

- కడప ప్రాజెక్టు సీఈగా నియామకం
- రెగ్యులర్ ఎస్ఈగా డిప్యూటీ ఎస్ఈ బాలచంద్రారెడ్డి



కర్నూలు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖలో పలువురు ఇంజనీర్లకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తికి చీఫ్ ఇంజనీరు (సీఈ)గా పదోన్నతి ఇస్తూ కడప జిల్లా ప్రాజెక్ట్ సీఈగా బదిలీ చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా 2017లో బాధ్యతలు తీసుకున్నారు. 2021లో ధవళేశ్వరం ప్రాజెక్టు క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా బదిలీచేసింది. 2022లో శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈగా బదిలీ చేశారు. అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో మూడేళ్లకు పైగా ఎస్ఈగా పనిచేసిన ఏకైక వ్యక్తిగా రికార్డు నమోదు చేసుకున్నారు. సీఈగా పదోన్నతిపై కడపకు బదిలీ చేయడంతో రెండు మూడు రోజుల్లో రిలీవయ్యే అవకాశం ఉంది. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈ బాలచంద్రారెడ్డి ప్రస్తుతం ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా ఉన్నారు. ఈయనకు ఎస్ఈగా పదోన్నతి ఇచ్చి ఇక్కడే రెగ్యులర్ ఎస్ఈగా నియమించారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు క్వాలిటీ సెల్ సబ్ డివిజన్-3 డీఈఈ ఎన్.వేణుగోపాల్‌కు ఈఈగా పదోన్నతి ఇచ్చి నంద్యాల జిల్లా ఎస్ఆర్‌బీసీ ఎస్ఈ ఆఫీస్ డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు.

కష్టపడి పనిచేస్తే విజయం ఖాయం



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

- ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుదాం
- ప్రజలను మోసం చేస్తున్న, బీజేపీ, కూటమి ప్రభుత్వం
- బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్ పార్టీకే..
- పార్టీ బలోపేతానికి అందరూ కృషిచేయాలి
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

నంద్యాల రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో కష్టపడి పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ అధ్యక్షతన జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసమ స్యలపై నిరంతరం పోరాడుదామని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అప్పుడే ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం దక్కించు కోవచ్చన్నారు. దేశంలోని బీజేపీతో రాష్ట్రంలోని కూటమి నేతలు సక్రమ పొత్తు పెట్టుకొని, వైసీపీ నేత జగన్‌తో అక్రమ పొత్తు పెట్టుకొని ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషిచేయాలని, నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారానికి రెండు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గత ఎన్నికల్లో ప్రజలు ఓట్లు చీలకూడదని వైసీపీపై వ్యతిరేకతతో కూటమికి వేశారని, ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ఓట్లు తిరిగి వెనక్కి రావాలంటే ప్రజలకు పార్టీపై నమ్మకాన్ని కలిగించేలా కృషిచేయాలన్నారు. రాష్ట్రంలోని అన్నిపార్టీలు బీజేపీ పక్షాన ఉండడంతో బీజేపీ ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి గణేష్ యాదవ్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నంద్యాల ఇన్‌చార్జి అలీఖాన్, రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన్ ప్రభాకర్, అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బడి గంట మోగని గూడెం



బడి తలుపులు తెరుచుకోని జానాలగూడెం పాఠశాల ఇదే

కొత్తపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కానీ కొత్తపల్లి మండలంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న జానాలగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల తలుపులు మాత్రం తెరుచుకోలేదు. ఐటీడీఏ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక ఎంఈవో పర్యవేక్షణలో నిర్వహించే ఈ పాఠశాల పునఃప్రారంభమైందా లేదా? అనే విషయం ఐటీడీఏ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఏప్రిల్ 23 వరకు శివపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న అంకమ్మ అనే ఉపాధ్యాయురాలు జానాలగూడెంలోని పాఠశాలలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు. అయితే..ఈమె కొట్టాల చెరువులోని గిరిజన పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో జానాలగూడెం పాఠశాల తలుపులు గురువారం తెరుచుకోలేదు. ఈ విషయంపై కొత్తపల్లి ఎంఈవో2 ఇనయతుల్లాను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఈ విషయాన్ని ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పారని తెలియజేశారు.

పనులు చేస్తూ అనంత లోకాలకు..
లారీ ఢీకొని కార్మికుడి దుర్మరణం

జూపాడుబంగ్లా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హైవేపై పనులు చేస్తూ ఓకార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మం డలంలోని తర్తూరు వద్ద చోటుచేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారా యణ తెలిపారు. వివరాలు.. నందికొట్కూరు మండలం బొల్లవ రం గ్రామానికి చెందిన పక్కీరయ్య(45) తర్తూరు అంచె వద్ద జాతీయ రహదారి పనుల్లో గురువారం ఉదయం పనులు చేస్తు న్నాడు. కంకర మిక్సింగ్ లారీ అతడిని ఢీకొట్టింది. అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనాస్థలికి చేరుకున్నారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ నరేషయాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, లాజరస్, గౌరిశ్వరనాయుడు డిమాండ్ చేశారు.

604 సెల్‌ఫోన్లు రికవరీ



మొబైల్ ఫోన్ల రికవరీ మేళాలో బాధితులతో పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాలులో మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. గురువారం కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు రికవరీ చేసిన 604 మొబైల్ ఫోన్లను ఏఎస్పీ హుసేన్‌పీరా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రెండో విడత మొబైల్ రికవరీ మేళా నిర్వహించామని, మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు రూ.1.30 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్లను పోగొట్టుకుంటే Https://kurnoolpolice.in/mobiletheft వెబ్‌లింక్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాల ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పకూడదని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(ఏఆర్) కృష్ణమోహన్, ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి, సీఐలు అబ్దుల్ గౌస్, నాగరాజరావు, రామయ్య నాయుడు, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీం పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను
నిర్మూలించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి పిలుపు ఇచ్చారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో ఓ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం 2016 ప్రకారం బాల బాలికలతో పని చేయించుకోవడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఈ చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే వారికి ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్ మాట్లాడుతూ ఎవరికైనా బాల కార్మికులు కనిపిస్తే హెల్ప్‌లైన్. నెంబర్.15100కు కానీ, 1098కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కోడుమూరులో భారీ వర్షం

79.4 మి.మీ., వర్షపాతం



అనుగొండ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న హంద్రీ నది

కోడుమూరు రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలంలో గురువారం వేకువజామున భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన వర్షం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా పడింది. దీంతో ఆరుబయట నిద్రిస్తున్న ప్రజలు ఇళ్లలోకి పరుగులు తీశారు. వర్షపునీటితో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఇక లోతట్టు పొలాల్లో నీళ్లు నిలిచాయి. దీంతో రైతులు గట్లను తెంపి కిందకు వదిలారు. వర్షం ఇటీవల వేసిన పత్తి, ఉల్లి వంటి పంటలకు అనుకూలించింది. మరో వైపు సేద్యపు పొలాలు బురదమయం కావడంతో విత్తుకు ఆలస్యం కానుందని రైతులు పేర్కొన్నారు. భారీవర్షానికి హంద్రీనదికి వరద పోటెత్తడంతో ఉధృతంగా ప్రవహించింది. గోరంట్ల వద్ద హంద్రీనదిలో అటు ఇటు రాకపోకలు స్తంభించాయి. మండలంలో సుమారు 79.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

విమాన ప్రమాద ఘటనపై ఎంపీ దిగ్భ్రాంతి

కర్నూలు అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు ఒక ప్రకటన ద్వారా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాఘాని నగర్‌లోని వైద్య కళాశాల భవనంపై విమానం కూలిన ఘటనలో 242 మంది ప్రయాణికులు మృతి చెందడంతో అత్యంత బాధకరమన్నారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టౌన్ మోడల్ కళాశాలలోని జిల్లా వృత్తి విద్యాధికారి సురేష్‌బాబుకు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. పీఆర్‌వోలతో అడ్మిషన్లు చేయిస్తూ ఎన్నికల ప్రచారాన్ని మించి కార్పొరేట్ విద్యాసంస్థలు మాయ మాటలు చెప్పి ప్రచారం చేస్తూ అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అస్లాంబాషా, విజయ్, రాము, సతీష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒలింపిక్ డే సెలబ్రేషన్స్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 23వ తేదీ వరకు ఒలింపిక్ డే సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సోషల్ మీడియా అధ్యక్షులు బి.రామాంజనేయులు తెలిపారు. ఈ నెల 15 నుంచి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెస్, హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, తైక్వాండో, కరాటే, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, జూడో, షూటింగ్ బాల్, రగ్బీ, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, సీలంబం, కబడ్డీ, యోగాసన, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, వాలీబాల్, త్రోబాల్, స్క్వేర్ మార్షల్ ఆర్ట్స్, రైఫిల్ షూటింగ్ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా క్రీడాంశాల ఇన్‌చార్జిలకు తమ పేర్లను నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాల్సిందిగా వివరించారు. విద్యాసంస్థలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పోటీల వేదిక వివరాలను 9908196883ను సంప్రదించాలని కోరారు.

యువతను మోసం చేసిన ప్రభుత్వం: వైసీపీ

కర్నూలు న్యూసిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేసిందని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. గురువారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదన్నారు. నిరుద్యోగ భృతి అందించకుండా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. విద్యార్థి, యువజన సమస్యలపై ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ పాల్గొన్నారు.

తల్లికి వందనంలో కోత విధించడం సరికాదు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద ఇచ్చే రూ.15 వేలలో కోత విధించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల అభివృద్ధి పేరుతో రూ.2వేలు కోత పెట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అకౌంటులో డబ్బులు వేస్తామని చెప్పి ఆ సందేశాన్ని అలాగే ఇవ్వకుండా నిబంధనలు ఈ పథకంలో విధించడం దుర్మార్గపు చర్య అన్నారు. నిబంధనలు తొలగించి విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం అందించాలని కోరారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం

ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

కర్నూలు న్యూసిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ విమర్శించారు. గురువారం సీఆర్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నిరుద్యోగులను విస్మరించి కేవలం 16,423 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ తప్ప మరే ఉద్యోగాల గురించి ఆలోచించకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు బీసన్న, రాజీవ్, రమేస్, హనుమేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కల్లూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): షరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డితో కలిసి గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సర్వేపల్లి విద్యార్థి మిత్ర పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. హెచ్ఎం నూర్జహాన్ పాల్గొన్నారు.

ఏడాది పాలనపై సంబరాలు

కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసిన టీడీపీ శ్రేణులు

కల్లూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 36వ వార్డు ఉల్చాల వై-జంక్షన్‌లో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలను ప్రజలకు పంచిపెట్టారు. ఈకార్యక్రమానికి కల్లూరు అర్బన్ వార్డుల ఇన్‌చార్జి పెరుగు పురుషోత్తంరెడ్డి, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, రెడ్డిగారి చంద్రకళాధర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా పెరుగు పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తుందన్నారు. సీఎం చంద్ర బాబు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దిశగా చర్యలు తీసుకుంటు న్నారన్నారు. పింఛన్లు రూ.4 వేలకు పెంపు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ, ఉచిత ఇసుక, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలతోపాటు ఈనెలలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనున్నారని తెలిపారు. కె.పార్వతమ్మ మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో రాష్ట్రంలో ఆదర్శంగా నిలవనుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు 1800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ కారిడార్‌లో పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీయూ మాదన్న, జవ్వాజి గంగాధర్‌గౌడ్, ఎస్.ఫిరోజ్, మాదేష్, జనార్ధన్‌ఆచారి, రాములమ్మ, పోలిరెడ్డి, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంబరాలు

కర్నూలు లీగల్: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.నాగముని ఆధ్వర్యంలో న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. జి.నాగముని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈసందర్భంగా న్యాయవాదులు కేక్ కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ బి.మోహన్ రెడ్డి, న్యాయ వాదులు



టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

మోహన్‌బాబు, కాశీ విశ్వనాథ్, విక్రమ్ సింగ్, బడేసాబ్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే స్వర్ణాంధ్రే లక్ష్యంగా పలు అభివృద్ధి పనుల్లో దూసుకుపోతుందని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. గురువారం కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది సందర్భంగా మండల కేంద్రమైన ఓర్వకల్లులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పేరుకుపోయిన అప్పులను కూటమి ప్రభుత్వ తీరుస్తూ అభివృద్ధి సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. అలాగే ఎస్సీ కాలనీలో దళిత నాయకుడు ఏసేపు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీరామిరెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లా, అల్లాబాబు, శ్రీరాములు, బోయ రమేష్, కొంతలపాడు మధుసూదన్‌గౌడు, రాజు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: ఏడాది కూటమి పాలనలో సీఎం చంద్రబాబు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటరామరాజు ఒక ప్రకటన తెలిపారు. రాష్ట్రంలోని ఆలయాల్లో పనిచేసే అర్చకుల జీతాలు పెంచారని, వేదం చదివిన విద్యార్థులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు అందించారని కొనియాడారు.

కోడుమూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఇరిగేషన్ విశ్రాంతి భవనంలో టీడీపీ నాయకులు గురువారం కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామక్రిష్ణారెడ్డి, గోపాల్‌నాయుడు, బడెసాగౌడ్, గంగాధర్‌నాయుడు, బ్రిటీష్‌రాముడు, నారాయణ, కేయి రాఘవేంద్రగౌడ్, బలరాం, అయ్యప్ప, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

గూడూరు: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల టీడీపీ అధ్యక్షుడు జే.సురేష్ అన్నారు. గురువారం మండలంలోని బూడిదపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. టీడీపీ నాయ కులు గోపాల్ రెడ్డి, బంగారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర పురోగతి సాధ్యం

కర్నూలు కల్చరల్: సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర పురోగతి సాధ్యమని టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా నగరంలోని హరిహర క్షేత్రంలో చంద్ర బాబు నాయుడుపై ప్రత్యేక పూజలు చేయించారు. సండేల్ చంద్రశేఖర్ అన్ని వర్గాలకు సరైన న్యాయం చేస్తూ, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ చంద్రబాబు నాయుడు ముందుకు పోతున్నారని, కూటమి ప్రభుత్వంలో రైతుల మొదలు అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు.



వై-జంక్షన్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు



ఓర్వకల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



కోడుమూరులో..



గూడూరు మండలం బూడిదపాడులో..

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఇన్‌చార్జి డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో యాజమాన్యం తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో తొలగించిన 2,500 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

పత్తి ఓబులయ్యకు సన్మానం



పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న బిట్స్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు

కర్నూలు కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న (హంస పురస్కారం) అవార్డు, ఎన్టీఆర్ జాతీయ రంగస్థల అవార్డు అందుకున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నటుడు, నాటక దర్శకుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్యను బిట్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గురువారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బిట్స్ విద్యాసంస్థల చైర్మన్ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు విద్యావేత్తలు పాల్గొని ఆయనకు శాలువ కప్పి, పూలదండ, జ్ఞాపిక అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కర్నూలులో కళలు, కళారంగానికి చేయూత ఇస్తూ, రాష్ట్ర స్థాయిలో జిల్లా నాటక రంగ ఖ్యాతిని చాటిచెబుతున్న పత్తి ఓబులయ్యకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కళారత్న అవార్డు అందించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ముద్రిక ప్రింటర్స్ అధినేత భాస్కర్, విశ్రాంత అధ్యాపకుడు బీవీ మాధవరావు, జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ జయ శంకర వరప్రసాద్, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ఆకుల శ్రీనుబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



విద్యార్థినులకు కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఓర్వకల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా కూటమి ప్రభుత్వం గురువారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ చేశారు. ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవోలు ఓంకార్ యాదవ్, శ్రీధర్‌బాబు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి బ్యాగ్, నోటు పుస్తకాలు, షూస్, సాక్సులు, బెల్టులు, యూనిఫాం, టెస్టు పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవో ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలి

కలెక్టరేట్ ఎదుట చెట్నేహళ్లి గ్రామస్థులు, వీహెచ్‌పీ నాయకుల ధర్నా

కర్నూలు కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంత్రాలయం మండలం చెట్నేహళ్లి గ్రామంలో గత 400 ఏళ్లుగా గ్రామ హిందూ ప్రజలు వినియోగించుకుంటున్న శ్మశాన వాటిక (శ్మశాన భూమి)కి రక్షణ కల్పించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకులు, చెట్నేహళ్లి గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. గురు వారం కలెక్టరేట్ ముందు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, వీహెచ్‌పీ రాష్ట్ర విశేష సంపర్క్ టి.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ చెట్నేహళ్లి గ్రామంలో సర్వే నెంబర్లు 113లో 3.83 ఎకరాలు, 114లో 1.02 ఎకరాల భూమిని ఆ గ్రామ శ్మశాన వాటికగా వాడుకుంటున్నారని తెలిపారు. ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమి, రస్తా, సీలింగ్ భూమిగా ఉన్నదని తెలిపారు. గత ప్రభుత్వం ఇదేస్థలంలో దళితవర్గాల వారికి కొంత భూమి ఇళ్ల స్థలాలుగా పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఇందులో కొందరు ఇళ్లు నిర్మించుకొని ఈ స్థలంలో శవ అంతిమ కార్యక్రమాలు చేసుకోకుండా అడ్డుపడుతున్నారని వారు ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో విజయశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు శివసాయినాథ్, గుజరాతి సురేష్, సల్కాపురం బాబు రావు, చెట్నేహళ్లి గ్రామస్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చెట్నేహళ్లి గ్రామస్థులు, వీహెచ్‌పీ నాయకులు

15న జిల్లా స్థాయి చెస్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ డే సందర్భంగా ఈ నెల 15వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. బాలబాలికలకు వేర్వేరుగా అండర్-14 విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు కప్‌తోపాటు మెడల్స్ ప్రతిభా సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. వివరాలకు 8790443030 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

లేబర్ కోడ్లను వ్యతిరేకించాలి: సీఐటీయూ

కర్నూలు న్యూసిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని లేబర్ కోడ్లను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో ఆయిల్ అండ్ రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నగర కార్యదర్శి సాయిబాబా అధ్యక్షతన జరిగింది. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కార్మి క చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్లను అమలు చేసుకునేందుకు ప్రధాని మోదీ సంకల్పంతో ఉన్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాకృష్ణ, నాయకులు శాలన్న, శేఖర్, హనుమంతు, మద్దిలేటి పాల్గొన్నారు.

అపరిచితుల మాటలు నమ్మొద్దు

కర్నూలు న్యూసిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నగరంలో అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మొద్దని నగర పాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ నగరంలో కొంతమంది అపరిచిత వ్యక్తులు వ్యాపార షాపులకు ఫలానా పత్రం తప్పనిసరి అని, నగదు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యం

కర్నూలు అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివ ర్సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హార్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకుడు, జిల్లా పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యోగా ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్ వెంకటేశ్వర్లు, సీడీసీ డీన్ సీవీ సుందరానంద్, బి.కవిత, శివకిషోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా ధనిబాబు

కర్నూలు న్యూసిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ ఆదోని డీఈఈ ధనిబాబు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఈఈగా పని చేస్తున్న ఈరన్నను నందికొట్కూరుకు బదిలీ చేశారు.

ఎస్సీ సంక్షేమ హాస్టల్ వార్డెన్‌గా ధనుంజయుడు

కోడుమూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ వసతిగృహం వార్డెన్‌గా గురువారం ధనుంజయుడు బాధ్యతలు స్వీకరించారు. సి.బెళగల్ మండలంలోని ఎస్సీ వసతిగృహంలో వార్డెన్‌గా పని చేస్తున్న ఈయన బదిలీపై కోడుమూరు హాస్టల్‌కు వచ్చారు. ఆత్మకూరు నుంచి బదిలీపై వచ్చిన తోకల భాస్కర్ సి.బెళగల్ ఎస్సీ సంక్షేమ హాస్టల్ వార్డెన్ బాధత్యలు స్వీకరించారు.

పనులను వేగవంతం చేయండి: కమిషనర్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ అశోక్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షం నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షం పడిన సమయంలో నీటిని తొలగిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, డీఈఈ గంగాధర్, ట్రైనీ ఏఈ మనోజ్ ఉన్నారు.

క్షయని నిర్లక్ష్యం చేయొద్దు

కోడుమూరు రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా చికిత్స పొందాలని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ తెలిపారు. మండలంలోని అమడగుంట్లలో గురువారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని అన్నిగ్రామాల్లో క్షయపై వందరోజులపాటు అవగాహన కల్పిస్తామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ క్షయ అంటువ్యాధి అని ఒకరి నుంచి మరొకరికి వేగంగా సోకుతుందని అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, ఆకలి, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడడం వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులలో క్షయ నిర్ధారణ పరీక్ష చేసుకోవాలన్నారు. అనంతరం సర్పంచ్ వరలక్ష్మీ అధ్వర్యంలో వైద్యసిబ్బంది పోస్టర్లు విడుదల చేసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ వెంక టేశ్వర్లు, సీహెచ్‌వో శాంత, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, హెచ్ఎస్ శారద, హెచ్ఏ బేబీ పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడటం సమష్టి బాధ్యత



ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను కాపాడటం సమష్టి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి లీలా వెంకటశేషాద్రి ఆదేశాల మేరకు నగరంలోని నైస్ కంప్యూటర్ శిక్షణ కార్యాలయంలో బాలలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలతో ప్రతిజ్ఞ చేయించారు.

వ్యవసాయాధికారిగా ఉషారాణి



దేవనకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధి కారిగా బి.ఉషారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలులోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో టెక్నికల్ అధికారిగా పనిచేస్తూ బదిలీపై దేవనకొండకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్‌బాబు తుగ్గలి మండలానికి వెళ్లారు.

గ్రామాల్లో అంగన్‌వాడీ పిలుస్తోంది



ఇంటింటికి తిరుగుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

వెల్దుర్తి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొసనపల్లె, వెల్దుర్తి అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది గురువారం అంగన్‌వాడీ పిలుస్తోంది నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని ఇంటింటికి వెళ్లి కోరారు. చిన్నారులకు పోషకాహారంతో పాటు ప్రీ ప్రైమరీ విద్య అందిస్తోందని తెలియజేశారు. ఈదమ్మ, షమీన, సుమలత, కిశోర్‌బాయి, బజారమ్మ, ఫాతీమాబీ పాల్గొన్నారు.

అతిసారపై జాగ్రత్త



పోస్టర్ విడుదల చేస్తున్న నోడల్ అధికారి డా. రఘు

తుగ్గలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అతిసార పట్ల జాగ్రత్తగా ఉండాలని నోడల్ అధికారి డా. రఘు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. వాంతులు, విరేచనాలు ఎక్కువగా అవుతుంటే వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ నాగమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ మౌలాలి తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించండి



వర్షపు నీటిలో ఆవేదన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్

ఆదోని , జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 35వ వార్డు అనురావతి నగర్‌లో డ్రైనేజీ, రహదారులను నిర్మించాలని ఆ వార్డు కౌన్సిలర్ వెల్లాల లలిత, మధుసూదన్ శర్మ వేదన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం కాలనీలో పర్యటించారు. వర్షపు నీటిలో నిలిచి అభివృద్ధి పనులు చేయించాలని కోరారు. వైసీపీని వీడి బీజేపీలో చేరినందుకే తనపై కక్షగట్టి వార్డును పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ కొన్ని వార్డుల్లో మాత్రమే తిరిగి, ఫోటోలు తీసి మీడియాలో పోస్టు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తమ వార్డును అభివృద్ధి చేయాలని కోరారు.

బుక్కాపురంలో వైద్యుల సర్వే



సర్వేకు వచ్చిన వైద్యబృందం

వెల్దుర్తి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం గ్రామంలో గురువారం కర్నూలు వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. పది మంది పీజీ, ఇంటర్న్‌షిప్ వైద్యుల బృందం క్వాలిటీ అసెస్మెంట్ సర్వేను సామాజిక వైద్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ సింధియా శుభప్రద బీపీ, సుగర్, ఎత్తు, బరువు, చుట్టుకొలత అంశాలను పరిశీలించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డా.అరుణ, డీసీఎస్ డా.రాధ, అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, డా.భువనతేజ, పీజీ సబిహా, లెక్చరర్ సురేశ్‌కుమార్, ఎంపీహెచ్‌ఈవో సత్యం, సూపర్‌వైజర్ మోహన్, అన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కళావతి, ఏఎన్‌ఎమ్ పద్మబాయి, ఆశా శాంతమ్మ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



కరివేములలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

దేవనకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేముల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు గురువారం సాముహిక అక్షరాభ్యాసం చేయించినట్లు ఐసీడీఎస్ సీడీపీవో మద్దమ్మ తెలిపారు. గ్రామాలలో అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించిందన్నారు. సూపర్‌వైజర్ షహిన బేగం, టీచర్లు ప్రశాంత, హైమావతి పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



సుభాష్ చంద్రబోస్ (ఫైల్)

ఆలూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహోతూరు గ్రామానికి చెందిన మహానంది కుమారుడు సుభాష్ చంద్రబోస్(15) అదృశ్యమయ్యాడు. ఈనెల 10వ తేదీన క్రికెట్ ఆడుకుంటూ అదృశ్యమైన ట్లు తండ్రి ఫిర్యాదు చేశారు. సిమెంట్ కలర్‌షర్ట్, నల్లరంగు ప్యాంట్ ధరించాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9121101158 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ మహబూబ్‌బాషా తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం ఇచ్చామని అన్నారు.

ఏడాది పాలన భేష్

- టీడీపీ నాయకుల సంబరాలు
- ఆలూరులో బైక్ ర్యాలీ
- ఆదోనిలో కేక్ కట్ చేసిన నాయకులు
- పత్తికొండలోనూ వేడుకలు



ఆలూరులో వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



పత్తికొండలో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

ఆలూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి కావడంతో గురువారం ఆలూరులో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ముందుగా పట్టణంలో భారీఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యకర్తల నడుమ కేక్ కట్ చేశారు. అనంతరం వీరభద్రగౌడ్ మాట్లాడుతూ పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ప్రణాళికాబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం ద్వారా కుటుంబంలో చదువుకునే వారందరికీ రూ.15వేలు తల్లుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏబీసీ డీసీ చైర్మన్ నగరడోణ కిష్టప్ప, బీజేపీ ఇన్‌చార్జి వెంకటరాముడు, టీడీపీ కన్వీనర్ అశోక్, పరమారెడ్డి, గిరి మల్లేష్‌గౌడ్, రఘుప్రసాద్‌రెడ్డి, అట్టికల్ బాబు, మార్గదర్శి రమేష్, శివప్రకాష్, కృష్ణంనాయుడు, హరిరెడ్డి, నరసప్ప, కొమ్ము రామంజి, సతీష్, నౌనేపాటి చౌదరి, అంపయ్య, మల్లి, మసాల జగన్, గూళ్యం రామాంజి, రాముయాదవ్, సర్పంచ్ మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

పత్తికొండలో విజయోత్సవం

పత్తికొండ: పార్టీ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, బత్తిని వెంకట్రాముడు ఆధ్వర్యంలో విజయోత్సవం నిర్వహించారు.



ఆదోనిలో ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో సంబరాలు



దేవనకొండలో ఎన్టీఆర్‌కు కప్పట్రాళ్ల బొజ్జమ్మ నివాళి

మార్కెట్‌యార్డ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఏడాది పాలనలో ఎమ్మెల్యే శ్యాంబాబు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబీ, మర్రిశ్రీరాములు, వెల్దుర్తి సుబ్బరాయుడు, మద్దికెర ధనుంజయుడు, మనోహర్‌చౌదరి, చందోలి తిరుపాల్, రామానాయుడు, సురేష్‌కుమార్, చల్లారవి, తిమ్మయ్యచౌదరి, సోమ్లానాయక్, కడవలసుధాకర్, బీటీ గోవిందు పాల్గొన్నారు.

దేవనకొండ: టీడీపీ ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి దిశలో సాగుతోందని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకోవడంతో టీడీపీ కార్యాలయం వద్ద కేకు కట్ చేశారు అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, కన్వీనర్ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

మద్దికెర: మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, ఎన్.లక్ష్మినారాయణ, తాలుకా టీడీపీ అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్ మీసేవ భీమరాజు, పారా విఠోభ తదితరులు ఉన్నారు.

ఆదోని: ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వ ఏడాది పాలన సాగిందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. కూటమి నాయకులు స్వకులసాలే నాయకులు మారుతీరావు, చాగి మల్లికార్జున రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సాధికా బేగం, కార్యకర్తలు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చడం ఆనందంగా ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన అవినీతి అక్రమాలు, నేరాలకు నిలయంగా మారిందన్నారు. టీడీపీ ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడం గర్వకారణ మన్నారు. నీలకంఠ, అల్లాప్, వెంకటరెడ్డి, వెంకటేష్, అయ్యన్న, అమర్ ప్రకాష్, సుబ్బు, ఈరన్న, అన్వర్ బాష, శ్రీదేవి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి సుభాష్

ఆదోని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలని ఆదోని 1వ అడిషనల్ జ్యుడీషియల్ న్యాయాధికారి సుభాష్ సూచించారు. గురువారం పట్టణంలోని కల్లుబావిలో లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. పిల్లలను బడికి పంపాలని, వారితో పరిశ్రమలు, హోటళ్లలో పనిచేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోర్టు నామినేటెడ్ మెంబర్ మమతా లోకేష్, టూటౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి కార్మిక అధికారులు ప్రతప్‌రెడ్డి, లీగల్ కమిటీ సభ్యులు కళ్యాణ్ రెడ్డి, బాలు, నాగరాజు, సూపర్న పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన సుభిక్షం

ఆదోని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం షేక్షావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, తిరుమల రెడ్డి ఉన్నారు.

జవాన్ కుటుంబానికి రూ.లక్ష సాయం



నగదు ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆదోని అగ్రికల్చర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన వీర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి మాజీ మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఆయన గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉగ్రవాదుల దాడుల్లో మురళీ నాయక్ మృతిచెందడం బాధాకరమన్నారు.

మహిళపై దాడి

- నలుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్, జూన్ 12 ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లు గ్రామానికి చెందిన మహిళ నారాయణమ్మపై కొందరు దాడిచేశారు. బాధితురాలి కథనం మేరకు.. అదే గ్రామానికి చెందిన కొండగేని వెంకటేశులు, భీమా, తాయన్న, హుసేన్ పిడి గుద్దులతో దాడి చేయడంతో పళ్లు రాలిపోయాయి. అడ్డు వచ్చిన భర్త ఆంజనేయపై కూడ దాడి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్ తెలిపారు.

14న యోగా డ్రిల్

తుగ్గలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా ఈ నెల 14న యోగాడ్రిల్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విశ్వమోహన్ గురువారం తెలిపారు. ఈ నెల 21న జరిగే యోగా పోటీలకు సన్నద్ధం కావాలని కోరారు.

ఏఎస్‌వోగా రఘువీర్

క్రిష్ణగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారిగా రఘువీర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జానకీబాయి వెల్దుర్తికి బదిలీ అయ్యారు. కోడుమూరులో పనిచేస్తున్న రఘువీర్ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

పశువుల దాణా పంపిణీ

హాలహర్వి, జూన్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పశువుల దాణా పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి అశోక్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ పాలిచ్చే పశువులకు ఈ దాణా ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రతి రైతుకు 50 కేజీల చొప్పున ఇస్తామన్నారు.

వ్యాయామం చేయాలి

మద్దికెర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని, ఒకేచోట కూర్చుని పని చేస్తే ఆరోగ్యం పాడవుతుందని సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి డా.రఘు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆయన సందర్శించారు. అసంక్రమిత వ్యాధుల పోస్టర్‌ను విడుదల చేశారు. జీవన శైలిలో వచ్చిన మార్పులతో ఎక్కువ మంది అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. రక్తపోటు, షుగర్, క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వైద్యాధికారి రాగిణి, సీహెచ్‌వో నిరంజన్‌బాబు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి అక్బర్ బాషా పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని మాచాపురంలో మంచానికే పరిమితమైన వారిని డా.రఘు సందర్శించి, వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉప్పు, కారం, చక్కెర తక్కువగా తీసుకోవాలన్నారు. వైద్యులు వెంకటేశ్వర్లు, అరుణజ్యోతి, హెచ్‌ఏవో రంగస్వామి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో నిండిన చెరువులు



కంబాలపాడు వద్ద పొంగిపొర్లిన హంద్రీ వంక



ఆస్పరిలో నీటితో నిండిన వెంగళాయిదొడ్డి చెరువు

క్రిష్ణగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం, నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురియడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కంబాలపాడు, పెను మాడ, ఎరుకల చెరువు చెరువులు నిండాయి. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పరి: మండలంలో బుధవారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసంది. దీంతో వెంగళాయిదొడ్డి చెరువు నిండింది. చెరువుకు రూ.3.88లక్షలతో మరమ్మతులు చేయించినట్లు సాగునీటి సంఘం అధ్యక్షుడు బసవరాజు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

దేవనకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. గురువారం దేవనకొండలోని బీసీ కాలనీలో ఇరవై ఏళ్లుగా పెండింగ్ ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, సిద్దం హంపిరెడ్డి, ప్రేమ్‌నాథ్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ఆనందు, కందనాతి రంగన్న, కబీర్, నర్సప్ప, రాజు పాల్గొన్నారు.

హంద్రీనీవా నీటికోసం చర్చించండి

మండలానికి హంద్రీనీవా సాగునీటి కోసం అసెంబ్లీలో చర్చించాలని ఎమ్మెల్యే విరుపాక్షికి సీపీఎం నాయకుడు వీరశేఖర్ వినతిపత్రం ఇచ్చారు. 46 వేల ఎకరాలకు సాగు రావాల్సి ఉన్న పనులు పూర్తికాకపోవడంతో 10వేల ఎకరాలకు మించి రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ సీహెచ్ లోకేశ్వరి అన్నారు. గురువారం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు నమ్మకం కల్పించాలని సూచించారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించి గుర్తింపు తేవాలని కోరారు. సమావేశంలో హెచ్ఎం మలికార్జున, ఉపాధ్యాయులు సుధాకర్, లోక్యానాయక్, ప్రసాద్ ప్రహ్లాద పాల్గొన్నారు.

బడిబాట

- విద్యార్థులకు సన్న బియ్యంతో పలావ్,గుడ్డు
- హొళగుంద, దేవనకొండ పాఠశాలల్లో నిలిచిననీరు



ఆదోని మున్సిపల్ హైస్కూల్‌లో మొదటి రోజు వచ్చిన విద్యార్థులు



హొళగుంద జడ్పీ పాఠశాలలో వర్షపు నీరు

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కావడడంతో విద్యార్థులు బడిబాట పడుతున్నారు. 48 రోజుల వేసవి సెలవులు ముగిశాయి. దీంతో పాఠశాలల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి కనిపించింది. కాగా మొదటి రోజు కావడంతో విద్యార్థులు స్వల్ప సంఖ్యలో మాత్రమే వచ్చారు. పట్టణంలో 39కిపైగా పురపాలక పాఠశాలలు ఉన్నాయి. మొదటి రోజు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికి తమను పరిచయం చేసుకున్నారు.

అడ్మిషన్ల కోసం క్యూ

పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చేరెందుకు విద్యార్థులు, తల్లిదండ్రులతో క్యూ కట్టారు. ఆరో తరగతిలో ప్రవేశానికి బారీగా వచ్చారు. హెచ్‌ఎం పయాజుద్దీన్ విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలించి ప్రవేశాన్ని ఇచ్చారు.

సన్న బియ్యంతో పలావ్

ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సమూలమైన మార్పులు తెచ్చింది. అందులో భాగంగా మొదటి రోజు సన్న బియ్యంతో కోడిగుడ్డు కూరతో, వెజిటేబుల్ పలావ్‌ను వడ్డించారు. ఆహారం రుచికరంగా ఉందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

హొళగుంద: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. తరగతి గదుల ముందు వర్షపు నీరు ఉండటంతో ఇబ్బందులు ఎదురుకున్నారు. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయని, ఫ్యాన్లు పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై హెచ్‌ఎం కబీర్ సాబ్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మొత్తం 350 మంది విద్యార్థులకు గానూ మొదటి రోజు గురువారం 16 మంది మాత్రమే వచ్చారు. విద్యార్థులకు ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన వెంటనే పుస్తకాలు, బ్యాగు లు అందుబాటులో ఉంచారు. హెచ్‌ఎం మోహన్ మాట్లాడుతూ మొదటి రోజు కావడంతో విద్యార్థులు పాఠశాలకు రాలేదని, తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇచ్చామని తెలిపారు. సన్నబియ్యంతో భోజనాన్ని వడ్డించారు. బీసీ హాస్టల్‌లో 200 మంది విద్యార్థులుండగా ఒక్కరూ రాలేదు. విద్యార్థులు లేకపోవడంతో హాస్టల్ సిబ్బంది తిరిగి వెళ్లిపోయారు.



మద్దికెరలో భోజనం చేస్తున్న విద్యార్థులు



దేవనకొండ జడ్పీ పాఠశాల ఆవరణలో వర్షపునీరు

చెరువుగా మారిన పాఠశాల

దేవనకొండ: మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణ చెరువుగా మారింది. చిన్న వర్షం వస్తే చాలు చెరువులా మారుతుంది. పాఠశాలల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా అవి నీళ్లపాలవుతున్నాయి.

వ్యయ భారం.. వ్యవసాయం

● పెరుగుతున్న సాగు ఖర్చులు ● పెరుగుతున్న ఎరువుల ధర ● ఇబ్బందుల్లో రైతన్నలు

గోనెగండ్ల, జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): వ్యవసాయరంగాన్ని నమ్ముకున్న రైతన్న ఈ ఏడాది ఎంతో ఆశతో ఖరీఫ్ సాగుకు ఉపక్రమించాడు. అడపదడపా వర్షాలు ఇప్పటికే పలుప్రాంతాల్లో కురిశాయి. దీంతో పలు ప్రాంతాల్లో విత్తనాలు రైతులు విత్తుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో సాగుకు ఆశించిన మేర వర్షాలు కురియక పోయినా దేవుని పై భారంవేసి బావులు, బోర్ల కింద ఉన్న పొలాల్లో విత్తనాలు విత్తుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గంలో 68వేల హెక్టార్ల సాగు చేయాల్సి ఉంది. అయితే గోనెగండ్ల 14వేల హెక్టార్లు, ఎమ్మిగనూరు 30 వేల హెక్టార్లు, నందవరం 13వేల హెక్టార్లలో పంటలు సాగు చేయాలి. అయితే ఇప్పటికే బావులు, బోర్ల దగ్గర కొంత సాగు చేశారు. పెరుగుతున్న కూలీల వ్యయం, ఎరువులు, పిచికారిమందులు, విత్తనాల అధికధరల గురించి అలోచిస్తుంటే రైతన్న గుండె గుభేలై .. వ్యవసాయం బరువెక్కి.. వ్యవసాయం చేయాలా.. వద్దా అనే అనుమానం కలుగుతోంది. బ్యాంక్ అధికారులు ఇచ్చే అరకొర రుణం ఎందుకు సరిపోక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.



విత్తనాలు విత్తుతున్న దృశ్యం

పెట్టుబడులు అధికం

ప్రస్తుతం పత్తి, వేరుశనగ, ఉల్లి, మొక్కజొన్న, మిరప, ప్రత్యామ్నాయ పంటలుగా కొర్ర, సజ్జ, జొన్న పంటలను రైతులు సాగుచేస్తున్నారు. అయితే పంటలకు పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. పత్తి పంటకు విత్తనాలు నాటడం నుంచి ఎరువులు, పిచికారి మందులు, కూలీలు, ఇతరత్రా కలసి ఎకరానికి దాదాపు రూ.50వేల నుంచి 60వేల వరకు ఖర్చు అవుతుంది. ఇక ఉల్లికి అయితే ఎకరాకు రూ. 60 నుంచి రూ. 80వేలవరకు ఖర్చు అవుతుంది. వేరుశనగకు ఎకరానికి రూ. 30 వేల నుంచి రూ.45 వేలవరకు ఖర్చు అవుతుంది. కాని పంట చేతికి అంది అమ్మకానికి వెళ్లితే గిట్టుబాటు ధరలు లభిస్తుందో లేదో గ్యారంటీ లేని పరిస్థితి



బోరు దగ్గర సాగు చేసి వేరుశనగపంట

ఆశతోనే పత్తి సాగు చేస్తున్నా

గత ఎడాది 2 ఎకరాల్లో పత్తి సాగు చేశాను దాదాపు రూ. 1.5లక్షలు పెట్టుబడి వచ్చింది. దిగుబడి కూడా బాగా వచ్చింది. నష్టమైతే రాలేదు. ఈఏడాది కూడా గిట్టు బాటు ధర పలుకుతుందనే ఆశతో మళ్లీ 3 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను.

● మాబు, రైతు, గోనెగండ్ల

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలి

కొన్ని రోజుల నుంచి విత్తనాలు విత్తడం మొదలైంది. ఎరువుల దుకణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువుల బస్తాలను విక్రయించాలి. అధిక ధరలకు విక్రయిస్తే వారి పై కఠినచర్యలు తీసుకుంటాం. ఎరువులు కొన్న సమయంలో రైతులు తప్పని సరిగా బిల్లు వ్రాయించుకొవాలి. అధిక దరలకు విక్రయిస్తే మాకు పిర్యాదు చేయండి.

● మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

పెరుగుతున్న ధరలతో కుదేలవుతున్న రైతు

రైతుల పెట్టుబడులు అడ్డదిడ్డంగా పెరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీతో పెరిగిన ధరలతో పంట సాగు ఎలా చేయాలంటూ రైతులు మదనపడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు ఎరువులు, పిచికారి మందుల ధరలను వ్యాపారులు పెంచారు. డీజిల్, పెట్రోల్ ధరలు కూడా పెరుగుతుండటంతో ట్రాక్టర్ల బాడుగలు విపరీతంగా పెరుగుతున్నాయి. చాల మంది రైతులు ఎద్దులను కాదని ట్రాక్టర్లల ద్వారా వ్యవసాయం చేస్తున్నారు. దీంతో ట్రాక్టర్ల బాడుగ ఎకరానికి రూ. 1000 నుంచి 1200 వరకు పలుకుతోంది. పంట పొలాల్లో పనిచేసే కూలీల ధరలు కూడ ఆకాశాన్ని చూపుతున్నాయి. ఒక్కోకూలీకి రోజుకు అవసరాన్ని బట్టి .రూ.350 నుంచి రూ. 450 పలుకుతోంది. పెరిగిన జీఎస్టీతో ఎరువుల ధరలపై 5శాతం, పెస్టిసైడ్స్‌పై 18శాతం, న్యూట్రిన్స్‌పై 12 శాతం పెరిగాయి.



పంట భూమిలో దుక్కి దున్నుతున్న దృశ్యం

ప్రారంభమైన పాఠశాలలు

ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు, జూన్12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో గురువారం అన్ని గ్రామాల్లో పాఠశాలలు ప్రారంభమయ్యాయి. మండలంలోని సిరాలదొడ్డి, రాళ్లదొడ్డి, కడివెళ్ల, కందనాతి, మసీదుపురం, మల్కాపురం, చెన్నాపురం, దేవిబెట్ట, మాస్‌మాన్‌దొడ్డి తదితర పాఠశాలలు ఉదయం 9గంటలకే ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో విద్యార్థులు పాఠశాలకు తక్కువగా హాజరయ్యారు. పెద్దకడుబూరు మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలు ఉదయం 9 గంటలకే తెరుచుకున్నాయి. బడిలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసి తరగతి గదులను సిద్ధం చేశారు.

మెనూ ప్రకారం భోజన పథకం నిర్వహించాలి

గోనెగండ్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం మధ్యాహ్నభోజనం పథకాన్ని అమలు చేయాలని ఎంఈవో నీలకంఠ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం పాఠశాల పునఃప్రారంభం అయ్యింది. దీంతో ఎంఈవో నీలకంఠ గోనెగండ్లలోని ఉన్నత పాఠశాల లోని మధ్యాహ్న బోజనాన్ని ఆయన పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం శుభ్రంగా రుచికరంగా ఉండేలా చూడాలని కోరారు. మెనూ ప్రకారం కాకుండా నిర్వాహకులు ఇష్టానుసారం వండితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషనం, లక్ష్మయ్య, మహబుబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడుబూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం లోని చౌలహళ్లి గ్రామంలో గత 30ఏళ్లుగా ముత్తమ్మ సాగుచేసుకుంటున్న పొలం సాగు చేయరాదని అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీ సభ్యులు బొగ్గుల తిక్కన్న డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 19/బీ1ఏలో 2.89 ఎకరాలను హరిజన ముత్తమ్మ సాగుచేస్తూ వస్తుందన్నారు. అయితే గ్రామంలో కొంతమంది ఆ భూమిలో పట్టాలు ఇచ్చారని ఆ భూమి తమదేనని వాదిస్తున్నారన్నారు. దీంతో బాధితురాలు కోర్టుకు వెళ్లి రెవెన్యూ, పోలీసు అధికారులు భూమిని సాగుచేసుకునేందుకు ఎలాంటి అడ్డు చెప్పరాదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే రెవెన్యూ అధికారులు హరిజన ముత్తమ్మతో పాటు తన భర్త నరసన్న, కుమారుడు బాలరాజు, కోడలు మహాలక్ష్మిలను కార్యాలయానికి పిలిచి భూమిసాగుచేయరాదని బెదిరించడం జరిగిందన్నారు. బాధితులను బెదిరింపులకు గురిచేసిన వారిపై ఉన్నతాదికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు



నవరత్నాల రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరించారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం జ్యేష్ఠ మాస పాడ్యమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో రాఘవ్రేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. బృందావనాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన దృశ్యం అలరించింది. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల బంగారు రథం పై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పండితులు హారతులు ఇచ్చిన అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగా వైభవంగా ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులకు పండితులు శేష వస్త్రం, ఫల,పుష్ప,మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి



భూకబ్జాపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

కోసిగి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం వైసీపీ ఇన్‌చార్జి, వైసీపీ జిల్లా కార్యదర్శి మురళిరెడ్డి 80 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను కబ్జా చేశాడని అగసనూరు, చిర్తనకల్ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తమ విచారణలో చెప్పడం జరిగిందని, వెంటనే ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వైసీపీ నాయకుడు మురళిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అక్కమతోట రామకృష్ణ అన్నారు. చిర్తనకల్ గ్రామానికి చెందిన రైతులు గోపాల్, మారెన్న, నన్నప్ప, బసవరాజు, పెద్ద మారెన్న, రైతులు గురువారం కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డికి బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, రామకృష్ణతో కలిసి తమ భూములను కబ్జా చేశాడని ఎస్ఐ హనుమంతరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం చిర్తనకల్, అగసనూరు గ్రామాల మధ్య వైసీపీ నాయకుడు కబ్జా చేసిన ప్రభుత్వ భూములను రైతులతో కలిసి బీజేపీ నాయకులు. ఎస్ఐలు పరిశీలించారు. కోసిగిలోని బీజేపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసిన మురళి రెడ్డిపైన, కందుకూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడిపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాముడు, కురువ మారన్న, నరసన్న, కడిదొడ్డి ఈరమ్మ, హంశేసీ, బసప్ప, మహబూబ్, హెబ్బటం వీరారెడ్డి, శ్రీనివాసులు వెంకటరెడ్డి ఉన్నారు.

శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్, జూన్12(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు గ్రామంలో గురువారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిన సందర్భంగా ఏడాది విజయోత్సవ ర్యాలీని గుడికల్లు వరకు నిర్వహించారు. ఇందులో భాగంగానే గ్రామంలో ఇప్పటి వరకు రూ.44లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లను ప్రారంభించారు. పాదయాత్రతో గుడికల్లుకు చేరుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి గ్రామంలోని మహిళలు, చిన్నారులు పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్య, పీఆర్‌డీఈ చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు, ఏఈలు జయన్న, టీడీపీ నాయకులు అప్పా బజార్ చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ మల్లికార్జున, ధర్మాపురం గోపాల్, కాశింవలి, గోనెగండ్ల రంగస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, మురళికృష్ణారెడ్డి, విరుపాక్షిరెడ్డి, దేవదాసు, కె.టి వెంకటేశ్వర్లు, జగదీష్, రాఘవేంద్రలతో పాటు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరో మూడు రోజుల పాటు వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, జూన్12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం 24 మీ.మీ వర్షాపాతం, శనివారం 15.1 మీ.మీ వర్షాపాతం, ఆదివారం 2.2 వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే పగటి పూట ఉష్ణోగ్రతలు 29.4 నుంచి 35.1 రాత్రిపూట ఉష్ణోగ్రతల 24.2 డిగ్రీల నుంచి 26.4 డిగ్రీలు ఉంటుందన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 15.6 కి.మీ నుంచి 21.7 కి.మీ వరకు వీచే అవకాశం ఉందన్నారు. రైతులు గమనించి సాగులో మెలకువలు తీసుకోవాలని ఆయన కోరారు.

పోలింగ్ కేంద్రాలను సరి చూసుకోండి


● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ



సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

మంత్రాలయం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల ఆధునీకరణ, కొత్త కేంద్రలా గుర్తింపు, ఓటరు నమోదు వంటి అంశాలపై ఆయా రాజకీయ పార్టీ నాయకులు సరి చూసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్.రవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నాలుగు మండలాల తహసీల్దార్లతో పోలింగ్ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నమోదు, తప్పులు ఒప్పులు, తొలగింపులు, చేర్పులు వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దకడుబూరు, కౌతాళం, కోసిగి తహసీల్దార్లు గీతా ప్రియదర్శిని, రజనీకాంత్ రెడ్డి, రుద్రగౌడు, ఆర్ఐ జనార్దన్‌రావు, మండల సర్వేర్ అశోక్, నవీన్, వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, ఆనంద్, నరసప్ప, ప్రభాకర్, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెం విజేత



కోసిగిలో పరుగు పందెం మొదటి విజేత నరసింహులు

కోసిగి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో ఏరువాక పండుగ సందర్భంగా రెండు రోజుల పాటు కోసిగిలోని యువకులకు పరుగు పందెం పోటీలు నిర్వహించడం ఆనవాయితి. గురువారం నిర్వహించిన పందెం పోటీల్లో పెద్దకడుబూరు మండలం బాపులదొడ్డి బస్టాండు నుంచి కోసిగిలోని గద్దరాళ్ల మారెమ్మ దేవాలయం వరకు 6 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలకు సుమారు 40 మంది యువకులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలు రెండు రోజులు నిర్వహించారు. గురువారం నిర్వహించిన పోటీల్లో కోసిగిలోని 4వ వార్డుకు చెందిన చింతలగేని నరసింహులు మొదటి విజేతగా నిలిచి, రెండో స్థానంలో రెండో వార్డుకు చెందిన నల్లనగేని నరసింహులు, మూడో స్థానంలో 3వ వార్డుకు చెందిన పరుశగేరి చిట్టి యువకులు విజయం సాధించారు. అయితే రెండు రోజుల పోటీల్లో చింతలగేని నరసింహులు మొదటి విజేతగా నిలిచడంతో శభాష్ నరసింహ అంటూ కోసిగి ప్రజలు, యువకులు అభినందించారు. అనంతరం విజేతలకు డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీదుల గుండా ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, మంత్రాలయం సీఐ రామాంజులు, కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి, ఏఎస్ఐలు నాగరాజు, ఆనంద్, పోలీసు సిబ్బంది గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కూటమితోనే సుపరిపాలన

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు,జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ సాగించిన రాక్షసపాలనకు ప్రజలు చరమగీతం పాడి ఏడాది పూర్తి అయ్యిందని.. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజలకు సుపరిపాలన అందుతోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిపాలన పూర్తి అయిన సందర్భంగా గురువారం ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సోగనూరురోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లతో భూమిపూజ చేశారు .అలాగే నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అక్కడినుంచి సోమప్ప సర్కిల్‌కు చేరుకొని విజయోత్సవ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులు పెద్దఎత్తున బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సోమప్ప సర్కిల్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావటంతో సర్కిల్ కాస్త పసుపుమయంగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ధర్మరాజు లాంటి చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి 52రోజులు జైల్లో పెట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రజలకు కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన అందిస్తుందన్నారు. పార్టీకోసం శ్రమించిన నాయకులను, కార్యకర్తలను విస్మరించే ప్రసక్తే లేదన్నారు. అనంతరం సోమప్ప సర్కిల్‌నుంచి కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఎమ్మిగనూరు మండలం గుడికల్ వరకు పాదయాత్రచేస్తు ర్యాలీగా వెళ్లారు. ర్యాలీలో వేలాది మంది టీడీపీ శ్రేణులు ఆనందంతో ఊర్రూతలూగుతూ పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తొగట నరసింహులు, జనసేన నాయకులు కరణం రవి, మార్కెట్ యార్డు చైర్మన్ కురువ మలయ్య, వైస్‌చైర్మన్ అంజి, నాయకులు బాస్కర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ



వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

విద్యార్థి పాఠశాల కిట్‌ల అందజేత

కౌతాళం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లను గురువారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గ్రామ కూటమి నాయకులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిణి-2 శోభారాణి గురువారం విలేకరులతో మాట్లాడుతూ నేడు పాఠశాలలు పునఃప్రారంభమవడంతో బడికి వచ్చే పిల్లలందరికి విద్యార్థి కిట్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నేడు వీటిని విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, గ్రామ టీడీపీ నాయకులతో కలిసి విద్యార్థులకు విద్యా కిట్‌లను అందజేసారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

● నది జలాలతో అభిషేకాలు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సోగనూరు రోడ్డులో వెలసిన జములమ్మ దేవి ఘనంగా వార్షికోత్సవాలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త మాజీ కౌన్సిలర్ తట్టే బుడ్డప్ప తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ జములమ్మ దేవి ఆలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేకంగా తుంగభద్ర నది నుండి నీరు తీసుకొచ్చి అభిషేకాలు చేశామన్నారు. మహిళలు కలశాలతో, బోనాలతో అమ్మవారికి భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తండోప తండాలుగా వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం చేశారు.. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాదిగుండు నీలకంఠప్ప, తిమ్మప్ప. దుష్యంత్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు బయలుదేరిన టీడీపీ నాయకులు



నందవరం నుంచి బయలుదేరుతున్న టీడీపీ నాయకులు

నందవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మిగనూరు నుంచి గుడికల్ వరకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చేపట్టిన పాదయాత్రకు గురువారం నందవరం మండల పార్టీ కన్వీనర్ డీవీ రాముడు ఆధ్వర్యంలో నందవరం నుంచి పాదయాత్రకు బయలుదేరారు సుపరిపాలన పేరిట ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమం కాశీంవలి, దర్మాపురం గోపాల్, మాజీ జెడ్పీటీసీ ఈరన్నగౌడు, గురురాజారావు, బండేగురుస్వామి, రైస్‌మిల్ నారాయణరెడ్డి, బార్గవ్ యాదవ్, జగన్నాథరెడ్డి, సత్యారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జబ్బార్, తిమ్మరాజు, మస్తాన్, గజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కోసిగి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం బడులు ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు ఎంఈవో-2 శోభారాణి మండలంలో పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు అందించారు. గ్రామపెద్దలు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు.

అభివృద్ధి కొనసాగిస్తాం

మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రాలయం నియోజకవర్గంలో రూ.43.75 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం మంత్రాలయం మండలం మాధవరంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నివాసంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావడంతో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొదటి విడత కింద రూ.9.56 కోట్లు, రెండో విడతలో రూ.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పీఆర్ నాబార్డుతో రూ.2.60 కోట్లతో రోడ్డు నిర్మాణాలు, ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.17.12కోట్లతో రోడ్లు, కల్వర్టులు పూర్తి చేశామన్నారు.. ఎంపీ నిధులతో 36 బోర్లు వేయించి తాగునీటికి కృషి చేశామన్నారు. రూ.5 కోట్లతో చిలకలడోన కేజీబీవీకి అదనపు భవనాలకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.1.62 కోట్లతో ఎల్లెల్సీ మరమ్మతులు, టీబీ కాలువకు 16 కిలోమీటర్లకు రూ.29 కోట్లు, 30 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.18.85 లక్షలు వంటి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, ఎల్లెల్సీ కాలువ చైర్మన్ చంద్ర, లక్ష్మన్న, పల్లెపాడు ముత్తురెడ్డి, రామిరెడ్డి, సురేష్ నాయుడు, అడివప్పగౌడు, అయ్యన్న, వెంకటేష్, రామకృష్ణ, శివ, నరసింహులు, రామచంద్ర, బసలదొడ్డి ఈరన్న, వీరారెడ్డి మంత్రాలయం వరదరాజులు, అశోక్‌రెడ్డి, కంసాలి నరసింహ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాధవరంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి